క్లుప్తంగా

అనాథ పిల్లలకు చేయూత



మల్దకల్: మండలంలోని తాటికుంట గ్రామానికి చెందిన భార్యాభర్తుల రాముడు, సంధ్య ఇటీవల చేపల వేటకు వెళ్లి మృత్యువాతపడ్డారు. తల్లిదండ్రుల మృతితో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు. వారికి బుధవారం మల్దకల్ శ్రీ హర్షిత పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు రూ.3000 నగదు సాయం చేశారు. చిన్నారుల విద్యకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నరేష్, బాబు, ప్రసంగి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల గ్రామంలోని పశువైద్యశాలలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 162 పశువులకు లంపీస్కిన్ టీకాలు (ముద్దచర్మ వ్యాధి నివారణ) వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి స్వరూపారాణి, వీఎల్‌ఓ వరప్రసాద్, షేక్ లతీఫ్, వెంకటమ్మ, రవి, కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



అయిజ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ హిందూ వాహిని తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి యాదిరెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ విజయవంతంగా పని చేసేందుకు నాయకులు, కార్యర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు నాగరాజు, నగేష్, భరత్‌రెడ్డి, కృష్ణ, జగదీష్, అశోక్ విశ్వ హిందూ పరిషత్ నాయకులు బసన్న గౌడ్, పరుశరాముడు, శివారెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అర్చకులు బుధవారం పంచామృతాభిషేకాలు చేశారు. అష్టోత్తర, శ్లోకాలతో ప్రత్యేక క్రతువులు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, అర్చకులు ఆంజనేయశర్మ, తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపే లక్ష్యం : సీపీఎం

వనపర్తి రూరల్: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు కోరారు. బుధవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డుల్లో పార్టీ స్వతంత్రంగా పోటీ చేస్తుందన్నారు. ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి నిత్యం పోరాటం చేస్తున్న పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆదరించి గెలిపించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ మతోన్మాద రాజకీయాలు చేస్తోందని, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నందున స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్, జీఎస్ గోపి, బాల్‌రెడ్డి, రాజు, జిల్లా కమిటీ సభ్యులు పరమేశ్వరాచారి, బాల్యానాయక్, ఎస్.రాజు, రమేష్, ఎం.కృష్ణయ్య, మహబూబ్‌పాషా, మేకల ఆంజనేయులు, వెంకటయ్య, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

భవాని.. ఓంకార రూపిణి



బీచుపల్లిలో మహిషాసురమర్దిని అలంకరణలో దుర్గామాత



ప్రాగటూరులో కాళికాదేవిగా అమ్మవారు



ధరూరు కాళికాదేవి ఆలయంలో..



శాంతినగర్‌లో ప్రత్యేక పూజల్లో అమ్మవారు



మల్దకల్‌లో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రులు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం పలు ఆలయాలు, మండపాల వద్ద అమ్మవారు మహిషాసుర మర్దినిగా పూజలందుకున్నారు. ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక అభిషేకాలతో పాటు కుంకుమార్చన పూజలు చేశారు. భవాని ఓంకార రూపిణి పాహిమాం అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.

- కేటీదొడ్డి మండలంలోని మల్లాపురంతండా తుల్జాభవానీ మహోత్సవంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతునాయుడు పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌నాయుడు, శ్రీనివాస్‌గౌడ్, మోనేష్, శ్రీరాములు, గోవిందు, ప్రహల్లాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.
- మల్దకల్ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో మహిషాసురమర్దిని అలంకరణలో వాసవీమాత భక్తులకు దర్శనమిచ్చారు. మార్కండేయస్వామి, ఎల్కూరు, బూడిదపాడు, అమరవాయి, బిజ్వారం గ్రామాల్లో వివిధ రూపాల్లోని అమ్మవారికి భక్తులు పూజలు చేశారు.
- శాంతినగర్ పరిధిలోని రామచంద్రానగర్, రామాలయంలో ప్రతిష్ఠించిన కనకదుర్గ అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావూరి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ గావించారు.
- ఇటిక్యాల మండల పరిధిలో ఆయా గ్రామాల్లో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగాయి. పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్దిని అలంకరణలో, మునగాల, చాగాపురం, భవానీయూత్, షాబాద్ శివాజీయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపాల వద్ద దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.
- ధరూరు మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో కోట యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు.
- అయిజ మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, కాళికాదేవి ఆలయాల్లో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో దుర్గామాత మహిషాసురమర్దినిగా, కోదండరామస్వామి ఆలయంలో జ్ఞానసరస్వతీదేవి సామ్రాజ్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



శాంతినగర్‌లో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు



శాంతినగర్‌లో..



మల్లాపురంలో పూజల్లో బీఆర్‌ఎస్ నాయకులు

ఘనంగా సద్దుల బతుకమ్మ



షేకుపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎర్రవల్లి/మానవపాడు/అలంపూర్/ఉండవెల్లి: మండల పరిధిలోని షేకుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. రంగురంగుల పూలతో తయారు చేసిన బతుకమ్మలను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా దేవాలయం దగ్గరికి తీసుకొచ్చారు. అనంతరం బతుకమ్మలను కీర్తిస్తూ పాటలు పాడుతూ మహిళలు, చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే, నాయకులు బొడ్డెమ్మలు వేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ స్నేహ, నాయకులు శ్రీధర్‌రెడ్డి, భీమేశ్వరెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- మానవపాడు మండలంలోని చెన్నిపాడులో శరన్నవరాత్రుల్లో భాగంగా ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువత ఆటపాటలు, నృత్యాలతో కోలాటలు ఆడుతూ సంబరంగా బతుకమ్మ నిర్వహించారు.
- అలంపూర్ మండలంలోని క్యాతూర్‌లో బతకమ్మ సంబురాలు వైభవంగా జరిగాయి. కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో మహిళలు బకతమ్మను సిద్ధం చేసి శిరస్సున ధరించి స్థానిక పుష్కర ఘాట్ కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడి పాడారు.
- ఉండవెల్లి మండలంలోని మారమునగాల–2లో శివాజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి ఆలయంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.



షేకుపల్లిలో బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే విజయుడు, నాయకులు



చెన్నిపాడులో బతుకమ్మ వేడుకల్లో చిన్నారులు

పురాతన బావికి పూర్వ వైభవం

- దసరా రోజు నవధాన్యాల నిమజ్జనం



పురాతన బావిని శుభ్రం చేసిన తర్వాత ఊటనీటితో ఉన్న బావి



బావిని శుభ్రం చేస్తున్న కూలీలు

గట్టు: మండల కేంద్రంలోని పురాతన కాలం నాటి రాతి కట్టడం బావికి పూర్వ వైభవం వచ్చింది. సంత బజారులోని భవానీమాత దేవాలయం పక్కనే రాతితో కట్టిన శేషంబావిలో చెత్తా చెదారం నిండి ఎవరూ పట్టించుకోకపోవడంతో బావి అధ్వానస్థితికి చేరుకుంది. ఈ క్రమంలో ఎస్‌ఎస్‌కే సమాజ్ యువకులు ముందుకు వచ్చి దాతల సహకారంతో బావిని శుభ్రం చేసే పనులు చేపట్టారు. బావిలోని నీటిని బయటకు తోడి, పూడిక తీశారు. బావిలోకి ఊటనీరు వచ్చి చేరడంతో చూడటానికి కనుల విందుగా మారింది. దసరా పండుగ రోజున ఎస్‌ఎస్‌కే సమాజ్ సభ్యులు దేవీ నవరాత్రుల సందర్భంగా నవధాన్యాల మొలకలను ఇదే బావిలో తరతరాలుగా నిమజ్జనం చేస్తూ వస్తున్నారు. దసరా పండుగ నాటికి పురాతన బావికి ఎస్‌ఎస్‌కే సమాజ్ యువకులు పూర్వవైభవం తీసుకు రావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారంతోనే సరైన ఎదుగుదల



ధరూరులో విజేత బాలికలను సన్మానిస్తున్న ఐకేపీ సిబ్బంది



మాచర్లలో కిశోర బాలికల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం దేవదాసు

గట్టు: కిషోర బాలికలు సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా చక్కటి ఎదుగుదల ఉంటుందని ఏపీఎం దేవదాసు అన్నారు. బుధవారం మండలంలోని మాచర్ల గ్రామంలో కిషోర బాలికల సంఘాల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కిషోర బాలికలకు ఆరోగ్యం, విద్య, ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేందుకు అవగాహన కల్పించారు. బాలికలు తమ సందేహాలు, సమస్యలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, జమ్మన్న, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ధరూరు: దసరా సెలవుల ముగింపు సందర్భంగా ఐకేపీ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ర్యాలంపాడు గ్రామాల్లో పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం నరహరి మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, అలాగే న్యూట్రీషన్ ఫుడ్ తీసుకోవాలన్నారు. కిశోర బాలికల సమస్యలపై చర్చించుకునేందుకు ప్రభుత్వం స్నేహ బాలికల సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం గెలుపొందిన బాలికలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీసీలు నవీన్‌కుమార్, నాగ్యనాయక్, రాములు, శ్రీనిధి మేనేజర్ రషీద్, వీఓఏలు పద్మ, రూతమ్మ, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అయిజ: మున్సిపాలిటీ పరిధిలో అక్టోబర్ 2 (గాంధీ జయంతి) సందర్భంగా గురువారం జంతువధ, మాంసం, మద్యం విక్రయించినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.

ఎర్రవల్లిలో దసరా సందడి



ఎర్రవల్లి: మండల కేంద్రంలో దసరా పండుగను పురస్కరించుకొని బుధవారం దుకాణాలు జనాలతో రద్దీగా మారాయి. వస్త్ర, కిరాణం దుకాణాలు, పూల అంగళ్ల వద్ద విక్రయాలు జోరుగా సాగాయి. చౌరస్తాలో జన సంద్రంతో పండుగ వాతావరణం సందడి సందడిగా నెలకొంది.

పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికలు



మానవపాడులో మాట్లాడుతున్న అధికారులు



ఇటిక్యాలలో ..

ఇటిక్యాల: మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునంద అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చినందున ఓటర్లను ప్రభావితం చేసే ప్రచార అంశాలను వెంటనే తొలగించాలన్నారు. మీడియాలో వచ్చే ప్రకటనలు సోషల్ మీడియా ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రచార సభలు, సమావేశాలు ఊరేగింపులు, ర్యాలీలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. మోడల్ కోడ్ అమలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రప్ప, ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, ఎస్‌ఐ రవినాయక్, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

కేటీదొడ్డి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని తహసీల్దార్ హరికృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పోలింగ్ ప్రశాంతంగా సాగేలా సహకరించాలని కోరారు. అభ్యర్థుల ఖర్చుల నమోదు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, ఉరుకుందు, శ్రీపాదరెడ్డి, హన్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సమావేశం

మానవపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాఘవ, తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సమావేశం నిర్వహించారు.

నిర్వహణపై అవగాహన ఉండాలి

ఉండవెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలని ఎంపీడీఓ తిరుపతన్న అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ ప్రభాకర్, ఎస్‌ఐ శేఖర్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికలపై అవగాహన సమావేశం నిర్వహించారు. కోడ్ ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మిర్చి రైతుల కష్టాలు

- అధిక వర్షాలతో నేలవాలిన పంట
- లబోదిబోమంటున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

అలంపూర్ నియోజకవర్గంలో మిర్చి సాగు వివరాలు..(ఎకరాల్లో)

మానవపాడు	ఇటిక్యాల	ఎర్రవల్లి	అయిజ
3,980	2,850	2,725	1,018
రాజోళి 920	అలంపూర్ 264	వడ్డేపల్లి 150	



గోకులపాడులో అధిక వర్షాలతో నేలవాలిన మిర్చి మొక్కలను చూయిస్తున్న రైతులు

మానవపాడు: మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా మారింది మిర్చి రైతుల పరిస్థితి. అసలే అకాల వర్షాలతో ఆరుగాలం కష్టించి లక్షలాది రూపాయాలు పెట్టుబడులు పెట్టి పండించిన పంట నీటి పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండటం వేరుకుళ్లు తెగుళ్లు ఆశించి దోమ, నల్లి వంటి చీడపీడలు పెరగటంతో కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు.

- అలంపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా 13,690 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. అకాల వర్షాలతో భారీగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని మిర్చి రైతులు వాపోతున్నారు. సుమారు 6000 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని నియోజకవర్గ వ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకోంటున్నారు.
- అకాల వర్షాలతో మిర్చి పంట నష్టం వివరణ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై జిల్లా ఉద్యానశాఖ అధికారి అక్బర్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

పంట నేలవాలింది



10 ఎకరాల వరకు మిర్చి పంట సాగు చేశాను. అధిక వర్షాలతో మిర్చి పొలంలో వర్షం నీరు నిలిచి పంట నేలవాలింది. నీరు నిలవడంతో పంట పెరుగుదల నిలిచి, మొక్క ఎండిపోయే ప్రమాదం ఉంది. పెట్టుబడి ఎక్కువగా ఉంది. దిగుబడి వస్తోందో రాదో అని ఆందోళనగా ఉంది.

– భీమరాజ్, గోకులపాడు

అధికారులు పరిశీలించాలి



18 ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. అధిక వర్షాలతో పొలాల్లో వర్షం నీరు నిలిచి పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. క్షేత్రస్థాయిలో మిర్చి పంటను అధికారులు పరిశీలించాలి. నష్టపోయిన పంట వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– దొడ్ల రాముడు, మానవపాడు